https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 01 సంచిక : 318 బుధవారం 4-2-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం

Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో

నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?

అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా

రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో

పనిచేసేందుకు విలేఖరులు కావలెను...

మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు

9989788438, 9505485656.

## ప్రజాస్వామ్యానికి మచ్చ

### రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 03:** లోక్‌సభలో తనను మాట్లాడకుండా నిరోధించడం సభ సంప్రదాయాన్ని ఉల్లంఘించడమేనని ప్రతిపక్ష నేత, ఎంపీ రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. మంగళవారం నాడు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు రాహుల్ గాంధీ లేఖ రాశారు. ప్రతిపక్ష నాయకుడిగా తాను జాతీయ భద్రతకు సంబంధించిన అంశాలపై మాట్లాడకుండా అడ్డుకునేందుకు ఉద్దేశపూర్వక ప్రయత్నం జరిగిందని రాహుల్ తన లేఖలో పేర్కొన్నారు. అందుకే సభలో తీవ్రమైన ఆందోళనకు దారి తీసిందని చెప్పుకొచ్చారు. రాష్ట్రపతి ప్రసంగంలో జాతీయ భద్రత ఒక కీలక భాగమని అన్నారు. దీనిపై పార్లమెంటులో చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. సభలో తన ప్రసంగాన్ని అడ్డుకోవడం ప్రాథమిక ప్రజాస్వామ్య హక్కులను నిరాకరించడమే అవుతుందని రాహుల్ చెప్పారు. పార్లమెంటరీ చరిత్రలో తొలిసారిగా.. రాష్ట్రపతి ప్రసంగంపై ప్రతిపక్ష నేత మాట్లాడకుండా ప్రభుత్వం ఆదేశాల మేరకు అడ్డుకున్నారని పేర్కొన్నారు. ఇది మన ప్రజాస్వామ్యానికి మచ్చ అని అభివర్ణించారు. దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తూ.. తాను నిరసన తెలియజేస్తున్నానని స్పీకర్ ఓం బిర్లాకు రాసిన లేఖలో రాహుల్ గాంధీ కుండబద్దలు కొట్టారు.

## 140 కోట్ల భారతీయులకు

# మేలు చేసే డీల్..

### యూఎస్‌తో వాణిజ్య ఒప్పందంపై పీయూష్ గోయల్



**న్యూఢిల్లీ:** భారత్–అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం రైతుల నుంచి మత్స్యకారుల వరకూ దేశంలోని 140 కోట్ల మందికి ప్రయోజనకారిగా ఉంటుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. ఇరుదేశాల మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరిందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం, ఆ విషయాన్ని ప్రధానమంత్రి మోదీ ధ్రువీకరించడం అనేక ప్రశ్నలకు తావిచ్చింది. దీంతో ఈ ట్రేడ్ డీల్‌కు సంబంధించిన కొన్ని వివరాలను మీడియాతో పీయూష్ గోయల్ పంచుకున్నారు. పార్లమెంటులో ఈ (ట్రేడ్ డీల్) వివరాలను పంచుకోవాలని తాను అనుకున్నానని, అయితే లోక్‌సభలో ఈరోజు ఎంత రభస జరిగిందో అందరూ చూశారని గోయల్ అన్నారు. సభలో జరిగిన దానికి రాహుల్ గాంధీని ఆయన తప్పుపట్టారు. మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణే అముద్రిత పుస్తకం నుంచి విపక్ష నేత కొన్ని అంశాలను ప్రస్తావించేందుకు చేసిన ప్రయత్నమే ఈ రభసకు కారణమని అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో తనకున్న మైత్రీ సంబంధాలను ఉపయోగించుకుని మనం పోటీ పడే అన్ని దేశాల కంటే బెస్ట్ డీల్‌ను ప్రధానమంత్రి మోదీ కుదుర్చుకున్నారని పీయూష్ గోయల్ తెలిపారు. 'ఎన్నో సవాళ్లు ఉన్నాయి. 50 శాతం టారిఫ్‌లను భారత్ ఎదుర్కొంది. రైతులు, సముద్ర ఉత్పత్తుల ఎగుమతి దారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. డీల్ ఎప్పుడు కుదురుతుందంటూ కొన్నిరోజుల క్రితం వరకూ విపక్షాలు మమల్ని అడుగుతూనే ఉన్నాయి. నెలల తరబడి ఈ డీల్ పొందలేకపోయాం. కానీ ప్రధాని తనకున్న మైత్రీ సంబంధాలను ఉపయోగించుకుని గొప్ప డీల్ కుదిర్చారు. ఈ డీల్‌తో భారత్‌కు ఎన్నో విధాలుగా మేలు జరుగుతుంది' అని గోయల్ వివరించారు. వ్యవసాయరంగం పరిరక్షణపై వ్యక్తమవుతున్న అనుమానాలపై మాట్లాడుతూ.. వ్యవసాయం, పాడిరంగం పరిరక్షణపై మొదట్నించీ మోదీ దృష్టిసారించారని, వాటికి ఎలాంటి చెడు జరగదని చెప్పారు. సముద్ర ఉత్పత్తులను ఎగుమతి చేసే మత్స్యకారులు ఈ డీల్ తర్వాత పండుగ చేసుకుంటారని, భారత ఉజ్వల భవిష్యత్తుకు ఈ డీల్ సంకేతమని చెప్పారు. ముఖ్యంగా ఇంజనీరింగ్, టెక్స్‌టైల్స్, మెరైన్ గూడ్స్, జెమ్స్, జ్యూవెల్లరీ రంగాలకు చాలా ప్రయోజనాలు చేకూరుతాయని పీయూష్ గోయల్ వివరించారు.


## 8మంది ఎంపీల సస్పెన్షన్..



ఢిల్లీ: లోక్‌సభలో తాజా బడ్జెట్ సమావేశాల సందర్భంగా 8మంది ప్రతిపక్ష పార్టీల ఎంపీలపై సస్పెన్షన్ వేటు పడింది. స్పీకర్ ఓం బిర్లాపై వైపుగా కాగితాలను విసిరినందుకు వారిపై సస్పెన్షన్ వేటు పడింది. కాంగ్రెస్‌కు చెందిన ఎంపీలు మాణిక్కం ఠాగూర్ (తమిళనాడు ఎంపీ), గుర్జీత్ సింగ్ ఔజ్లా (పంజాబ్), అమరీందర్ సింగ్ రాజా(పంజాబ్), కిరణ్ కుమార్ రెడ్డి (తెలంగాణ), హిబీ ఈడెన్ (కేరళ), డీన్ కురియకోస్ (కేరళ), ప్రశాంత్ పడోలే (మహారాష్ట్ర)తో పాటు సీపీఎమ్‌కు చెందిన ఎస్.వెంకటేశన్ (తమిళనాడు)ను మిగిలిన బడ్జెట్ సమావేశాలకు హాజరు కాకూడదంటూ లోక్‌సభ స్పీకర్ సస్పెండ్ చేశారు. స్పీకర్ ఓం బిర్లాపై కాగితాలు విసిరిన ఎంపీలపై చర్యలు కోరుతూ కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ ఆమోదించడంతో సస్పెన్షన్ వేటు పడింది (ాశీని ాఖుెప్త్రు ఖ్రూం ాబంజూవఅఎవం). భారత్–చైనా ఉద్రిక్తతలకు సంబంధించి ఆర్మీ మాజీ చీఫ్ నరవణె అముద్రిత పుస్తకంలోని అంశాలపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చర్చకు పట్టుబట్టిన నేపథ్యంలో ఎంపీలు నిరసనలకు దిగి సస్పెన్షన్‌కు గురయ్యారు.

## మణిపూర్ సీఎంగా

# ఖేమ్‌చంద్ సింగ్



న్యూఢిల్లీ: మణిపూర్ కొత్త ముఖ్యమంత్రిగా యుమునాం ఖేమ్‌చంద్ సింగ్ పగ్గాలు చేపట్టనున్నారు. జాతుల మధ్య ఘర్షణలతో మణిపూర్ అట్టుడకడంతో ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ గతేడాది రాజీనామా చేశారు. దీంతో తొలుత 6 నెలలపాటు అక్కడ రాష్ట్రపతి పాలన విధించి మరోసారి దానిని పొడిగించారు. ఈ క్రమంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు కేంద్రం చేపట్టిన సన్నాహకాల్లో భాగంగా బీజేపీ రాష్ట్ర శాసనసభా పక్ష నేతగా యుమునాం ఖేమ్‌చంద్ సింగ్ మంగళవారం నాడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో 62 ఏళ్ల ఖేమ్‌చంద్ మణిపూర్ కొత్త ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసేందుకు మార్గం సుగమమైంది. మణిపూర్‌లో ప్రభుత్వం ఏర్పాటుకు బీజేపీ జాతీయ నాయకత్వం కొన్నిరోజులుగా న్యూఢిల్లీలో కసరత్తు చేస్తోంది. మణిపూర్ బీజేపీ ఎమ్మెల్యేలతో కేంద్ర నాయకత్వం విస్తృత స్థాయి చర్చలు జరిపింది. అనంతరం మణిపూర్ శాసనసభా పక్ష నేత ఎన్నిక కోసం కేంద్ర పరిశీలకునిగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్‌ను నియమించింది. అనంతరం శాసనసభా పక్ష నేతగా ఖేమ్ చంద్ సింగ్ ఎన్నికయ్యారు. మణిపూర్ రాజకీయాల్లో బీజేపీ కీలక నేతగా ఖేమ్‌చంద్ పేరు తెచ్చుకున్నారు. 2017, 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఇంఫాల్ వెస్ట్‌లోని సింజమీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2017 మార్చి నుంచి 2022 మార్చి వరకూ మణిపూర్ అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేశారు. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ సాధించడంతో బీరేన్ సింగ్ ప్రభుత్వంలో రెండోసారి క్యాబినెట్ మంత్రిగా సింగ్ నియమితులయ్యారు. మున్సిపల్ పాలనా వ్యవహారాలు, హౌసింగ్ డెవలప్‌మెంట్, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్, విద్యా శాఖలను నిర్వహించారు. 2025 ఫిబ్రవరిలో మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించేంత వరకూ ఆ పదవులను ఆయన సమర్థవంతంగా నిర్వహించారు. రాజకీయాలతోపాటు మార్షల్ ఆర్ట్స్ పట్ల సింగ్‌కు ఆసక్తి మెండు. 2025 డిసెంబర్‌లో సియోల్‌లో గ్లోబల్ ట్రెడిషనల్ తైక్వాండో ఫెడరేషన్ నిర్వహించిన సంప్రదాయ తైక్వాండోలో ఫిఫ్త్–డాన్ బ్లాక్‌బెల్ట్‌ను ఆయన అందుకున్నారు. ఈ అవార్డును అందుకున్న తొలి భారతీయుడిగా నిలిచారు.

## అన్ని మున్సిపాలిటీల్లో

# గెలువబోతున్నాం..

### మంత్రులకు సీఎం దిశానిర్దేశం



**హైదరాబాద్, ఫిబ్రవరి 03:** పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటినట్లే మున్సిపల్ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించాలని తన కేబినెట్ సహచర మంత్రులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రచార వ్యూహాలపై మంత్రులకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. మంగళవారం నాడు హైదరాబాద్‌లో తన కేబినెట్ మంత్రులతో సీఎం రేవంత్ సమావేశమయ్యారు. మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించడంపై వారితో సమీక్షించారు. ఈ ఎన్నికల్లో విజయంపై నివేదికలన్నీ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగానే ఉన్నాయని వారికి సీఎం రేవంత్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వారికి సర్వే నివేదికలు అందజేశారు. అన్ని మున్సిపాలిటీల్లో గెలువబోతున్నామని జోస్యం చెప్పారు సీఎం రేవంత్. అయినా ఎన్నికల చివరి వరకు చాలా అప్రమత్తంగా ఉండాలని జాగ్రత్తలు చెప్పారు. ఇంకా ఎవరైనా రెబల్స్ ఉంటే.. వారిని రాజీ చేయాలని ఆదేశించారు. మంత్రులందరూ జిల్లాలకు వెళ్లాలని సూచించారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. అలాగే సర్వేల్లో వెనకబడిన మున్సిపాలిటీలను ఈ సందర్భంగా మంత్రులకు ఆయన సోదాహరణగా వివరించారు. అదే విధంగా జిల్లాల పర్యటన వివరాలను మంత్రులను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు జిల్లా ఇంఛార్జ్ మంత్రులతో సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రోజు వారి రిపోర్ట్ తనకు అందించాలని ఈ సందర్భంగా మంత్రులకు స్పష్టం చేశారు. ఇక అసంతృప్తి నేతలను బుజ్జగించాలని మంత్రులకు సీఎం రేవంత్ సూచించారు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ మున్సిపాలిటీలతోపాటు పలు మున్సిపల్ కార్పొరేషన్లకు ఫిబ్రవరి 11వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నారు. అందుకు సంబంధించిన షెడ్యూల్ ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఈ ఎన్నికల్లో నామినేషన్ల ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. నామినేషన్ల విత్ డ్రా సైతం నేటితో ముగిసింది. ఈ ఎన్నికల ఫలితాలు ఫిబ్రవరి 13వ తేదీన వెలువడనున్నాయి. అధికార కాంగ్రెస్, ప్రతిపక్షాలు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఇప్పటికే ఎవరికి వారు రంగంలోకి దిగి తమ సత్తా చాటేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి.

## ఎస్‌ఎఫ్‌డీఆర్ పరీక్ష విజయవంతం



**హైదరాబాద్, ఫిబ్రవరి 03:** భారత రక్షణ రంగ పరిశోధన సంస్థ మంగళవారం నిర్వహించిన సాలిడ్ ఫ్యూయెల్ డక్టెడ్ రామ్‌జెట్ (ఎస్‌ఎఫ్‌డీఆర్) పరీక్ష విజయవంతమైంది. భారత రక్షణ రంగ పరిశోధనలో ఇదో కీలక మైలురాయి అని నిపుణులు చెబుతున్నారు. ఒడిశాలోని చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్‌లో నిర్వహించిన ఈ పరీక్షలో ఎస్‌ఎఫ్‌డీఆర్ సాంకేతికత సక్రమంగా పనిచేసిందని డీఆర్‌డీఓ ఓ ప్రకటనలో తెలిపింది. గగనతలంలోని లక్ష్యాలను ఛేదించే దీర్ఘశ్రేణి మిసైల్స్‌ను రూపొందించేందుకు ఈ సాంకేతికతను అందిపుచ్చుకోవడం కీలకమని పేర్కొంది. ప్రయోగం విజయవంతం కావడంతో ఎస్‌ఎఫ్‌డీఆర్ సాంకేతికత కలిగిన అతికొద్ది దేశాల సరసన భారత్ కూడా చేరింది. సంప్రదాయక మిసైల్స్‌లో ఇంధనంతో పాటు దాన్ని మండించేందుకు అవసరమైన ఆక్సిడైజర్‌నూ నింపుతారు. దీంతో, వాటి బరువు పెరిగి రేంజ్ తగ్గుతుంది. అయితే, ఎస్‌ఎఫ్‌డీఆర్ సాంకేతికతతో గాల్లోని ఆక్సిజన్‌ను ఉపయోగించి ఇంధనాన్ని మండించొచ్చు. ఫలితంగా, ఆక్సిడైజర్ అవసరం చాలా వరకూ తగ్గిపోతుంది. మిసైల్‌లో మరింత ఇంధనాన్ని నింపే అవకాశం చిక్కుతుంది. దీంతో మిసైల్ మరింత ఎక్కువ దూరం ప్రయాణించి లక్ష్యాలను ఛేదిస్తుంది. సంప్రదాయక మిసైల్స్‌లో చివరి దశలో ఇంధనం అయిపోతుంది. కానీ ఎస్‌ఎఫ్‌డీఆర్ సాంకేతికతతో తుదవరకూ శక్తి లభించి మిసైల్ మరింత ప్రభావశీలంగా లక్ష్యాన్ని ధ్వంసం చేస్తుంది. ఎస్‌ఎఫ్‌డీఆర్ మిసైల్‌ను చివరి దశల్లో కూడా ప్రయాణదిశను మార్చే అవకాశం ఉండటంతో శత్రుదేశ లక్ష్యాలను ఇది మరింత సమర్థవంతంగా ఛేదించగలుగుతుంది.

## చమురు కొనుగోళ్లు నిలిపివేస్తామని భారత్ మాతో చెప్పలేదు : రష్యా స్పందన

న్యూఢిల్లీ: అమెరికాతో వాణిజ్య ఒప్పందంలో భాగంగా రష్యా నుంచి చమురు దిగుమతులను నిలిపివేయడానికి భారత్ అంగీకరించిందంటూ డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై క్రెమ్లిన్ స్పందించింది. న్యూఢిల్లీ నుంచి ఇంతవరకూ అలాంటి సంకేతాలేవీ తమకు రాలేదని పేర్కొంది. వాషింగ్టన్–న్యూఢిల్లీ మధ్య ట్రేడ్ ఒప్పందం కుదిరిందం టూ ట్రంప్ తన 'ట్రూత్'లో పోస్ట్ చేశారు. రష్యన్ చమురు కొనుగోళ్లను ఆపడానికి, అమెరికా, వెనెజువెలా నుంచి కొనుగోలు చేయడానికి భారత్ అంగీకరించినట్టు ట్రంప్ ప్రకటించారు. దీనిపై మోదీ వెంటనే స్పందించారు. భారత ఉత్పత్తులపై ఇక నుంచి 18 శాతమే అమెరికా సుంకాలు అమలవుతాయని, ఇది సంతోషకరమని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పేర్కొన్నారు. అయితే రష్యా నుంచి చమురు కొనుగోళ్లను నిలిపివేసే విషయంపై ఎలాంటి అధికారిక ప్రకటనా చేయలేదు.

## మేడారం జాతర విజయవంతం: సీతక్క



హైదరాబాద్, ఫిబ్రవరి 03: ములుగు జిల్లాలో ఇటీవల నిర్వహించిన మేడారం జాతర విజయవంతమైందని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. మంగళవారం సెక్రటేరియట్‌లో విలేకర్లతో మంత్రి సీతక్క ఇష్టాగోష్టిగా మాట్లాడారు. జాతర పనులు, గుడి పనులు సజావుగా జరిగాయని సంతోషం వ్యక్తం చేశారు. కొంత మంది జాతరతోపాటు ఏర్పాట్లపై విష ప్రచారం చేశారంటూ మండిపడ్డారు. ఎక్కడా.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాతర ముగిసిందని పేర్కొన్నారు. ఒక దొంగతనం ఘటనపై కొందరు తప్పుడు ప్రచారం చేశారని వివరించారు. ఒకట్రెండు రోజుల్లో 'తిరుగు జాతర' జరుగుతుందని తెలిపారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు సైతం ఈ జాతర ఏర్పాట్లు బాగున్నాయని ప్రశంసించారని మంత్రి సీతక్క వివరించారు. క్లాస్, మాస్‌తోపాటు ఉన్నత స్థాయి వర్గాల వారు సైతం ఈ జాతరకు భారీగా తరలివచ్చారని చెప్పారు. సుమారు రెండున్నర కోట్ల మంది భక్తులు ఈ మేడారం జాతరకు వచ్చినట్లు భావిస్తున్నామన్నారు. వచ్చే జాతర సమయానికి మేడారం పరిసర ప్రాంతాల్లోని రహదారులను వెడల్పు చేసి.. ట్రాఫిక్ జామ్‌లను నివారిస్తామని పేర్కొన్నారు.

## నిరుద్యోగులను నమ్మించి

# నయవంచన...

### రేవంత్‌పై కేటీఆర్ విమర్శలు



**హైదరాబాద్, ఫిబ్రవరి 3:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి కేటీఆర్ మరోసారి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోందని అన్నారు. మరో గ్యారెంటీ నుంచి నిస్సిగ్గుగా ముఖం చాటేసిన ముఖ్యమంత్రిని చూసి యువత ఛీకొడుతోందని ఆయన పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలని హామీ అని చెప్పి... ఇప్పుడు ఐదేళ్ల హామీ అంటూ మాటమార్చారంటూ సోషల్ మీడియా ఎక్స్‌లో మాజీ మంత్రి కేటీఆర్ పోస్టు చేశారు. మరో గ్యారెంటీ నుంచి నిస్సిగ్గుగా ముఖం చాటేసిన ముఖ్యమంత్రిని చూసి తెలంగాణ నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోందన్నారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చి అడ్డదారిలో రేవంత్ గద్దె ఎక్కారన్నారు. ఇప్పుడు అది ఐదేళ్ల హామీ అని, పీసీసీ చీఫ్‌తో సీఎం పలికిస్తున్న చిలుక పలుకులు చూసి యువతరం ఛీకొడుతోందని కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్ హయాంలో చివరి దశలో ఉన్న 65 వేల ఉద్యోగాలకు నియామక పత్రాలిచ్చి సీఎం ఫోటోలకు ఫోజు కొట్టారన్నారు. ఆ తర్వాత మొత్తానికే చేతులెత్తేయడంతో తెలంగాణలో 'రిక్రూట్‌మెంట్ జీరో'గా మారిపోయిందని మాజీ మంత్రి విమర్శించారు. జాబ్ క్యాలెండర్‌కు పాతరేసి, వరుస కుంభకోణాలతో రేవంత్ సర్కారు జేబులు నింపుకుంటున్న తీరును తెలంగాణ సమాజం నిత్యం గమనిస్తోందని చెప్పారు.

# బెదిరింపులు చేస్తే భయపడతామా?

**హత్య రాజకీయాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ నాయకులు**

**మండిపడ్డా బిఆర్ఎస్ నాయకులు డా. రాజరమేష్ బాబు**



**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 03, (మన సమాజం):** నామినేషన్ విత్ డ్రా చేసుకొమ్మని బెదిరింపు చర్యలకు పాల్పడితే భయపడతామా అంటూ కాంగ్రెస్ నాయకులపై మండిపడ్డారు బిఆర్ఎస్ నాయకులు డా. రాజరమేష్ బాబు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో 16 వ వార్డులో బిఆర్ఎస్ పార్టీ నుండి నామినేషన్ వేసిన గ్యాస్ నానిని మంగళవారం అతని ఇంటికి వెళ్ళిన కొందరు కాంగ్రెస్ నాయకులు వెళ్లి నామినేషన్ విత్ డ్రా చేసుకోవాలని లేదంటే చంపుతానని బెదిరించడం ముమ్మాటికి కాంగ్రెస్ పార్టీ హత్యరాజకియాలకు పాల్పడటమేన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గ్యాస్ నానికి గాని అతని కుటుంబ సభ్యులకు ఏదైనా జరిగితే రామకృష్ణాపూర్ కాంగ్రెస్ నాయకులదే పూర్తి బాధ్యత అన్నారు. సిపిఐ, బిఆర్ఎస్ పార్టీలు ఉమ్మడిగా ఎన్నికల బరిలో దిగితే కాంగ్రెస్ నాయకులకు ఓటమి భయం పట్టి అధికారంలో ఉన్నామనే అహంకారంతో ఇలాంటి నికృష్ట చర్యలకు పాల్పడటం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు సిపిఐ పార్టీ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్. క్యాతనపల్లి పుర సంఘం కార్యాలయం ఎదుట నామినేషన్ విత్ డ్రా కోసం జరిగిన ఈ తతంతుతో బిఆర్ఎస్ సిపిఐ, కాంగ్రెస్ నాయకుల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడగా పట్టణ ఎస్సై జె. శ్రీధర్ ఇరు వర్గాల నాయకులను అక్కడి నుండి పంపివేశారు.

# అభ్యర్థుల గెలుపే మా లక్ష్యం..

**మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్..**



**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 03, (మన సమాజం):** క్యాతనపల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో బిఆర్ఎస్ సీపీఐ కూటమిలో బాగంగ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేస్తామే కానీ బెదిరింపు రాజకీయాలకు పాల్పడటం తమకు రాదని చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. 16 వ వార్డు గంగా కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో బొజ్జ రాజయ్యను కాంగ్రెస్ పార్టీ నుండి బాల్క సుమన్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో అభివృద్ధిపై దృష్టి పెట్టామని, ప్రస్తుత ఎన్నికల్లో కూడా బిఆర్ఎస్ హయంలో జరిగిన అభివృద్ధిని చూపుతూ ముందుకు వెళతామని తెలిపారు. రాష్ట్ర మంత్రిగా ఉన్న వివేక్ ఈ నియోజకవర్గానికి తెచ్చిన నిధులు, చేసిన అభివృద్ధి ఏమి లేదని ఎద్దేవా చేశారు. క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికల్లో బారాస జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. బిఆర్ఎస్ 15 వార్డులు, సిపిఐ 7 వార్డుల్లో పోటీ చేస్తుందని, ప్రతి అభ్యర్థిని బారి మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు భయభ్రాంతులకు గురి చేసిన 16 వ వార్డు అభ్యర్థి గ్యాస్ నాని కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు డా. రాజరమేష్ బాబు, కంభగోని సుదర్శన్ గౌడ్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# పీఎస్‌యూల పునరుజ్జీవనానికి కొత్త స్ఫూర్తి

దేశంలో అతిపెద్ద కోకింగ్ కోల్ ఉత్పత్తిదారు, కోలిండియా లిమిటెడ్ అనుబంధ సంస్థ అయిన భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్, ఈ సంవత్సరం జనవరి 19న ఇనిషియల్ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ద్వారా స్టాక్ మార్కెట్లో లిస్ట్ అయింది. ప్రస్తుతం ప్రపంచ మార్కెట్ పరిస్థితులు ఆశాజనకంగా లేనప్పటికీ ఈ సంస్థ ఐపీఓ చరిత్ర సృష్టించింది. రూ.1,070 కోట్లను సేకరించడానికి ఆఫర్‌లో ఉన్న 46 కోట్ల షేర్ల కోసం 147 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబ్ అయింది. 90 లక్షలకు పైగా అప్లికేషన్లు దాఖలయ్యాయి. భారత ప్రభుత్వరంగ సంస్థల విజయవంతమైన ఐపీఓ లిస్టింగ్ ఇదొక్కటే కాదు. ఈ ఒరవడి గత కొన్నేళ్లుగా ఇలాగే స్థిరంగా కొనసాగుతోంది. గత 7--8 సంవత్సరాల కాలంలో దాదాపు 15 ప్రభుత్వరంగ సంస్థలు భారతీయ స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్ అవడంతోపాటు అవసరమైన మూలధనాన్ని సేకరించగలిగాయి. వాటాదారుల షేర్ల విలువను పెంచ డంతో పాటు రిటైలర్ల సంపదను కూడా సృష్టించగలిగాయి. 2017 నుంచి, భారతదేశంలో ఇంజనీ రింగ్, నిర్మాణం, రైల్వే, రక్షణ, ఇంధన సంబంధిత రంగాలలో 10కి పైగా అతిపెద్ద ప్రభుత్వరంగ సంస్థలు స్టాక్ మార్కెట్లలో లిస్ట్ అయ్యాయి. తద్వారా, దిగువ పేర్కొన్న కంపెనీలలో, మూలధన మార్కెట్ విలువ రూ. 1.40 లక్షల కోట్ల నుంచి రూ. 8.53 లక్షల కోట్లకు పెరిగింది–ఇది 513 శాతం భారీ పెరుగుదల.

# శనిగకుంట చుట్టూ తిరిగే కాంగ్రెస్ ద్వంద్వ రాజకీయాలు!

**- క్యాడర్ లేని గిల్డాకు కండువా... నైతికతకు మాత్రం తలుపులు మూసివేత**

**- "అక్రమార్కులకు చోటు లేదు" అన్నది నినాదమా? నాటకమా?**



**మంచిర్యాల ఫిబ్రవరి 03,(మన సమాజం) :** మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ రాజకీయాలు ఇప్పుడు శనిగకుంట చుట్టూనే తిరుగుతున్నాయన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. రామ్‌లాల్ గిల్డా సతీమణి అర్చన గిల్డా గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చెన్నూరు మున్సిపల్ చైర్మన్‌గా పనిచేశారు. అప్పట్లో ప్రజల్లో ప్రభావవంతమైన కేడర్ లేకపోయినా, ఆర్థిక బలం, కౌన్సిలర్ల మద్దతుతోనే చైర్మన్ పదవి దక్కిందన్న విమర్శలు బహిరంగంగానే ఉన్నాయి. కేడర్ కాదు, కనెక్షన్లే రాజకీయ అర్హతగా మారిన ఆ దశనే గిల్డా కుటుంబం ప్రతినిధ్యం వహించింది. నేడు "తాజా మాజీ చైర్మన్ కుటుంబం" అన్న ట్యాగ్ తప్ప, ప్రజా బలం మాత్రం శూన్యమే. అలాంటి గిల్డా ఆదివారం రాత్రికి రాత్రే మున్సిపల్ ఎన్నికల వేళ బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి, చెన్నూరు ఎమ్మెల్యే, మంత్రి వివేక్ ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకోవడం రాజకీయాల్లో సంచలనంగా మారింది. కేడర్‌పై స్పష్టత ఉన్న నాయకుడిగా పేరున్న మంత్రి, కేడర్ లేని గిల్డాను పార్టీలోకి ఆహ్వానించడానికి గల రాజకీయ అవసరం ఏంటన్నది అర్థంకాని ప్రశ్నగా మారింది. ప్రజల్లో పట్టులేని నాయకత్వాన్ని ఎత్తిపోసే ఈ ప్రయత్నం, కాంగ్రెస్ చెప్పుకునే సిద్ధాంతాలకు పూర్తి విరుద్ధంగా కనిపిస్తోంది. గిల్డా ఇటీవల శనిగకుంట మత్తడి పేల్చివేత కేసులో నిందితుడిగా పేర్కొనబడి జైలుకు వెళ్లి వచ్చిన వ్యక్తిగా రాజకీయ వర్గాల్లో చర్చకు వచ్చాడు. ఈ నేపథ్యం ఉన్నప్పటికీ ఆయనకు కాంగ్రెస్‌లో ఎర్ర తివాచీ పరచడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. ముఖ్యంగా మంత్రి వివేక్ బహిరంగంగా "అక్రమాలకు, అక్రమార్కులకు చెన్నూరు నియోజకవర్గంలో కాంగ్రెస్‌లో చోటు లేదు" అని చెప్పిన మాటలు ఇప్పుడు తిరిగి ఆయన్నే వెంబడిస్తున్నాయి.

ఇది మొదటిసారి కాదు. గత నెల క్రితం కూడా శనిగకుంట మత్తడి పేల్చివేతకు సంబంధించిన మరో నిందితుడిగా పేర్కొనబడిన వ్యక్తి మంత్రి సమక్షంలోనే కాంగ్రెస్‌లో చేరాడు. అక్రమార్కులను చేర్చుకోబోమని చెప్పిన నాయకత్వమే, అదే ఆరోపణలున్న వారిని పార్టీలోకి తీసుకోవడం రాజకీయ ద్వంద్వత్వానికి పరాకాష్ట. మాటలకు ఒక లెక్క, చేతలకు మరో లెక్క అన్నట్టుగా కాంగ్రెస్ వైఖరి మారిందన్న ఆరోపణలు బలపడుతున్నాయి. క్యాడర్ ఉన్న నాయకులు పక్కకు నెట్టబడుతున్న చోట, క్యాడర్ లేని గిల్డాలకు కండువాలు కప్పితే ప్రజలు ఏమనుకోవాలి? నైతికత పేరుతో రాజకీయాలు మాట్లాడే కాంగ్రెస్, అవసరమైతే అదే నైతికతను పక్కన పెట్టేస్తుందన్న భావన బలపడుతోంది. శనిగకుంట ఇప్పుడు ఒక మత్తడి మాత్రమే కాదు–చెన్నూరులో కాంగ్రెస్ రాజకీయాల నిజ స్వరూపాన్ని బయటపెట్టిన కేంద్రబిందువుగా మారింది. ఇది రాజకీయ అవసరమా? లేక నైతిక పతనమా? అన్న ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఇప్పుడు నాయకత్వంపైనే ఉంది.

# సాహిత్య సీమలో వైజ్ఞానికుడు

చందు సుబ్బారావు ప్రసంగాలు, పుస్తకాలు, సాహితీ విమర్శనా బాణాలు అందుకున్నవారు– ఆయన ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తెలుగు ఆచార్యులేమోనని అనుకునేవారు. కానీ ఆయన భూ భౌతికశాస్త్ర ఆచార్యుడు. అనేక పరిశోధనలు చేసి, పుస్తకాలు, వ్యాసాలు ప్రచురించి, పరిశోధక విద్యార్థులకు మార్గదర్శనం చేసిన సైంటిస్ట్. గుంటూరు జిల్లా, తెనాలి తాలూకా చదలవాడ గ్రామంలో 1946 మే 18న సుబ్బా రావు జన్మించారు. తల్లిదండ్రులు వెంకటకృష్ణయ్య, రాజ్యలక్ష్మి. వీరిద్దరూ కమ్యూని స్టులుగా కొనసాగుతున్నప్పుడే పెళ్లి చేసుకున్నారు. అలా పెళ్లి చేసుకున్న వారిలో వీరు తొలితరం దంపతులు. తండ్రి ఉపాధ్యాయుడు, మేనమామ ప్రఖ్యాత రచయిత బొల్లిముంత శివరామకృష్ణ కావడంతో సుబ్బారావుకు చిన్నప్పటి నుంచే వామపక్ష భావజాలం, సాహిత్యం అబ్బినవి.సమాజంలో చెడు పోకడలు, సాహితీ ప్రపంచంలో వస్తున్న పెడధోరణులు, సైన్సు అనుకున్నంత గొప్పగా భారతదే శంలో అభివృద్ధి చెందకపోవడం... వంటి వాటితో పాటూ దళిత, బహుజన, మహిళల స్థితిపై చందు నిత్యం మానసిక ఘర్షణ పడేవారు. ఆ ఆవేదనలోంచి వచ్చిన ఉపన్యా సాలు జనాన్ని ఉద్రూతలూగించేవి. చందు వలే అటు ప్రాచీన సాహిత్యాన్ని, ఇటు ఆధునిక సాహిత్యాన్ని సమపాళ్లలో రంగరించి మాట్లాడేవారు తెలుగు రాష్ట్రాల్లో బహు అరుదు. చందు– శ్రీశ్రీ అభిమాని. 1970లో శ్రీశ్రీ పుట్టిన రోజు సందర్భంగా విశాఖలో నిర్వహించిన 'విశాఖ విద్యార్థుల సభ'లో జ్వాలాముఖి ప్రసంగం విన్నవాళ్లలో చందు, నేనూ ఉన్నాం. తరువాత విశాఖ రచయితల సంఘంలో చేరి పురిపండా, రాచకొండ, కాళీపట్నం, చలసాని ప్రసాద్... అప్పుడప్పుడూ గొల్లపూడి, భమిడిపాటి వంటి అనేక సీనియర్ రచయితలతో కలిసి ఆయన సాహితీ చర్చలు చేసేవారు. ఆంధ్రా యూనివర్సిటీలో అప్పటికి తూమాటి దోణప్ప, పరిశోధకులుగా ఉన్న వెల్చేరు నారాయణరావు, బంగోరెతో పాటు కొర్లపాటి శ్రీరామమూర్తి, మలయవాసిని, అత్తలూరి నరసింహ రావుతో సాహితీ సమాలోచనలు జరుపుతుంటే– ఈయనెవరు? ఆర్ట్స్ కాలేజీలో ఏ డిపార్టుమెంటువా రు? అనుకునేవారంతా. చందు సుబ్బారావు సైన్స్ కాలేజీ మనిషి. ఫ్యాకల్టీ క్లబ్ నుంచి ఎక్కువగా సామాజిక శాస్త్రాలు, తెలుగు భాషా సాహిత్యం, ఆంగ్ల భాష అధ్యయనంతో పాటు, హిందీలో ఆదేశ్వరరావు, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ వంటి వారితో ఎక్కువ సమయం గడిపేవారు. చందు తన సబ్జెక్ట్ అయిన భూ భౌతికశాస్త్రానికి సంబంధించి విశాఖ ప్రాంతంలో నీటి వనరులు, అక్కడి కాలుష్యంపై పరిశోధనలు చేశారు. గ్రౌండ్ వాటర్ పెరుగుదలకు సంబంధించి జాతీయ సెమినార్లు ఏర్పాటు చేయటం, దానికో సంఘాన్ని ఏర్పాటు చేసిన వాళ్లలో చందు ప్రముఖ పాత్ర పోషించారు. ఆ సందర్భంలోనే-- 'చందూ! నువ్వు తెలుగు సాహిత్యంపై కృషి చేస్తున్నా, మంచి గుర్తింపు ఉన్నా, మనం యూనివర్సిటీ అధ్యాపకులం... మన పరిశోధనలు, ప్రచురణలు, పరిశోధక నిర్వహణ ఆధారంగానే మనకు గుర్తింపు ఉంటుంది' అని నేనాయనతో అంటే, అప్పుడు ఇంగ్లీషులో మూడు పుస్తకాలు ప్రచురించారు. బల్గేరియాలో పరిశోధన నిమిత్తం కొంతకాలం ఉండి, కమ్యూనిస్టు దేశాలు పర్యటించారు. చందు సుబ్బారావు సుమారు 20 పుస్తకాలు ప్రచురించారు. కొన్ని వందల వ్యాసాలు రాశారు. ఆయనే రాసుకున్నట్లు "రాసే గుణంతో పాటు గుర్తుంచుకునే బుర్ర ఉండడం వల్ల అయిదు దశాబ్దాల చరిత్రను (సాహితి) తెల్ల కాగితాలకెక్కించాను. 1968లో మహీధర రామమోహనరావు, శివరాం మావయ్య, మోహన్, గులాం గౌస్, పెద్దిబొట్ల, ప్రకాశ్ తదితరులు విశాలాంధ్ర వారిచ్చిన పేరుతో ఇతర పత్రికల్లో ప్రవేశించి ప్రఖ్యాతి కోసం ప్రయత్నించటం వాస్తవం." ఇంత నిర్మొహమాటంగా తన గురించి ఎలా చెప్పుకున్నారో సాహిత్య విమర్శ రాసేటప్పుడు, మాట్లాడేటప్పుడు అంతే కచ్చితంగా మాట్లాడేవారు. శ్రీశ్రీ కవిత్వంపై మాట్లాడేటప్పుడు... అలవోకగా ఆయన కవిత్వం పలుకుతూ మధ్యమధ్యలో విశ్వనాథ సత్యనారాయణ సంస్కృత భూయిష్ఠమైన ఆంధ్ర భాషా పద్యాలు చదివి రంజింపజేసేవారు. ఆయన ప్రచురించిన సుమారు నాలుగు సాహితీ పుస్తకాలు, అందులో ఎక్కువ వ్యాసాలుగా వివిధ పత్రికల్లో అచ్చయినవి. అవి ఎప్పటికీ చందును తెలుగు సాహితీ విమర్శకుల జాబితా తొలి వరుసలో ఉండేలా చేశాయి. పాఠకులు తప్పనిసరిగా చదవాల్సిన గ్రంథాలుగా తెలుగు శాఖ వారు ఈ పుస్తకాలను పేర్కొంటారని ఆశిస్తున్నా. 'కవికి విమర్శకుడు శత్రువు కాదు' అన్న మకుటంతో వెలువడిన పుస్తకం ప్రతి కవి, విమర్శకుడు చదవాల్సిన పుస్తకం. ముఖ్యంగా తాను అనువదించి, విశాలాంధ్ర ప్రచురించిన 'డా. బాబాసాహెబ్ అంబేడ్కర్' గొప్ప అనువాదం. ఒక సందర్భంలో వేగుంట మోహన్ ప్రసాద్ కవితా సంకలనాన్ని యూనివర్సిటీలో ఆవిష్కరింపజేసి,



అద్భుతంగా మాట్లాడారు. నేను అకడమిక్ స్టాఫ్ కాలేజీ డైరెక్టర్‌గా ఉన్నప్పుడు మన రాష్ట్రం, వివిధ రాష్ట్రాల అధ్యాపకులు ముఖ్యంగా తెలుగు భాషా ఉపన్యాసకులు పునశ్చరణ తరగతులకు వచ్చినప్పుడు చందు సుబ్బారావు ప్రసంగాలు ఉండేవి. ఆ విధంగా తెలుగు రాష్ట్రాల్లో ఉండే తెలుగు, ఆంగ్ల, హిందీ ఉపన్యాసకులు అందరూ చందును గుర్తుపెట్టుకుంటారు. కొర్లపాటి శ్రీరామమూర్తి, మలయవాసిని కోఆర్డినేటర్లుగా నేను తెలుగు సాహిత్యంపై జాతీయ స్థాయిలో పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్న సందర్భంలో అందరం ఆలోచించి 1989--90లో వెయ్యేళ్ల తెలుగు సాహిత్యంపై వారం రోజులు జరిపిన సభలు ఇప్పటికీ గుర్తున్నాయి. 'అరసం'కు అధ్యక్షుడిగా కొంతకాలం పనిచేసినా, విశాఖపట్నం అరసంను పురిపండా, చందు, ఉప్పల అప్పల రాజు చాలాకాలం నడిపించారు. 14వ రాష్ట్ర మహాసభలు విశాఖలో జరిపినప్పుడు రాష్ట్రంలోని అన్ని సాహితీ సంస్థల సభ్యులు, అరసం, విరసం, స్థానిక సంఘాల వారు పాల్గొని మరపురాని స్మృతులను మిగిల్చారు. ముఖ్యంగా తెలుగు పరిశోధకులు చేయని ఒక మంచిపని పరిశోధనలపై పరిశోధన అంటూ ఒక పీహెచ్‌డిని సమీక్షిస్తూ "అంకె లొక్కటే ప్రమాణాలు కావు, కాని ప్రమాణ సూచికలే" అన్నారు చందు. అంతేకాదు సామాజిక పరిశోధనలపై పరిశోధనలు చెయ్యాలని, ఆధునిక సామాజిక శాస్త్రవేత్తలు, భాషా సాహిత్యాల నుంచి రాబట్టవలసిన రాజకీయ, సాంఘిక శాస్త్రీయ నిర్ధారణలు అవసరం అన్నారు.

# రాష్ట్రంలో పెరుగుతున్న వీధి కుక్కల బెడద

- రెండేళ్ల బాలుడిపై దాడి
- హైదరాబాద్ నార్సింగి సర్కిల్‌లో కలకలం
- ఇంటి ముందు ఆడుకుంటుండగానే కుక్కల దాడి
- నిలోఫర్ ఆసుపత్రికి చిన్నారి తరలింపు
- అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం



**డెస్క్, ఫిబ్రవరి 3**
రాష్ట్రవ్యాప్తంగా వీధి కుక్కల బెడదపై ఆందోళన పెరుగుతున్న వేళ, హైదరాబాద్ నగరంలో మరో భయానక ఘటన చోటుచేసుకుంది. నార్సింగి సర్కిల్ పరిధిలో ఇంటి ముందు ఆడుకుంటున్న ప్రభాకర్ అనే వ్యక్తి రెండేళ్ల కుమారుడిపై వీధి కుక్కలు అకస్మాత్తుగా దాడి చేశాయి. చిన్నారి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు పరుగెత్తుకొచ్చినా అప్పటికే తీవ్ర గాయాలు అయ్యాయి. కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన చిన్నారిని కుటుంబ సభ్యులు హుటాహుటిన నిలోఫర్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం చిన్నారి చికిత్స పొందుతున్నట్లు సమాచారం. చిన్న వయసులోనే ఇలాంటి ఘటన జరగడం తల్లిదండ్రుల్లో తీవ్ర భయాన్ని, ఆవేదనను కలిగిస్తోంది. నార్సింగి ప్రాంతంలో వీధి కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిందని, పిల్లలు బయట ఆడాలంటే భయపడాల్సిన పరిస్థితి ఉందని స్థానికులు వాపోతున్నారు. గతంలోనే పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినా, ఎలాంటి శాశ్వత చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించకపోవడంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్న ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పట్టణాలు, గ్రామాల్లో వీధి కుక్కల దాడుల ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో, ప్రజల భద్రతపై ప్రభుత్వ బాధ్యతను ప్రశ్నించే పరిస్థితి ఏర్పడింది. పిల్లలు, వృద్ధుల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని, ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్
- మెట్‌పల్లి మండలం బండ లింగపూర్‌లో పరిశీలన
- ప్రతి ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం
- ధరల నియంత్రణకు కమిటీ ఏర్పాటు సూచన
- గడువులోపు లక్ష్యాల పూర్తి పై ఆదేశాలు



**మెట్‌పల్లి, ఫిబ్రవరి 3:**
మంగళవారం మెట్‌పల్లి మండలం బండ లింగపూర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మంజూరైన ఇందిరమ్మ ఇండ్లను పూర్తిస్థాయిలో గ్రౌండింగ్ చేయాలని కలెక్టర్ సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ప్రతి లబ్ధిదారునికి తెలంగాణ ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందజేస్తోందని తెలిపారు. ఇటుక, కంకర, బేస్మెంట్ వంటి నిర్మాణ సామగ్రి ధరల నియంత్రణ కోసం కమిటీ ఏర్పాటు చేసి, లబ్ధిదారులకు అనుకూలంగా ధరలు ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు ఎక్కడైనా వెనుకబడినట్లయితే వెంటనే వేగం పెంచాలని ఆదేశించారు. అధికారులకు కేటాయించిన లక్ష్యాలను గడువులోపు సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం ఇళ్ల నిర్మాణం జరగాలని, లబ్ధిదారులు అవసరమైన మేస్త్రీలు, కార్మికులను ముందుగానే ఏర్పాటు చేసుకుని నిర్మాణాన్ని సకాలంలో పూర్తిచేయాలని సూచించారు. ఆర్థిక సమస్యలు ఎదురైతే ఐకేపీ సహకార సంఘాల ద్వారా రుణాలు పొందవచ్చని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి దశలవారీగా బిల్లుల చెల్లింపులు ఆధార్‌కు అనుసంధానమైన లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ అవుతాయని వివరించారు. అనంతరం మార్కింగ్, బేస్మెంట్, స్లాబ్ లెవెల్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను కలెక్టర్ పరిశీలించి, లబ్ధిదారులతో నేరుగా మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేసి గృహప్రవేశం చేయాలని వారికి సూచించారు.



# నల్లగొండ అభివృద్ధే నా ప్రాణం

- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి - 25 ఏళ్లుగా ప్రజల ప్రేమే నా బలం
- హైదరాబాద్ తరహా అభివృద్ధే లక్ష్యం - మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు కోరిన మంత్రి



**నల్లగొండ, ఫిబ్రవరి 3**
గత 25 ఏళ్లుగా నల్లగొండ ప్రజలు తనపై చూపిస్తున్న ప్రేమాభిమానాలు వెలకట్టలేనివని, ఈ ప్రాంత ప్రజలే తన ప్రాణమని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం పలు డివిజన్లలో పర్యటించిన ఆయన, తన చివరి శ్వాస వరకు ఈ ప్రాంత ప్రజల సంక్షేమం కోసమే పని చేస్తానని స్పష్టం చేశారు. నల్లగొండను హైదరాబాద్ తరహాలో అభివృద్ధి చేయడమే తన ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో నల్లగొండకు భారీగా నిధులు కేటాయించి, ఇందిరమ్మ ఇళ్లు, సంక్షేమ పథకాలను ప్రతి గడపకు చేరుస్తున్నామని పేర్కొన్నారు. పట్టణ మౌలిక వసతులు, రహదారులు, పారిశుధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ప్రతిపక్షాల మాయమాటలను ప్రజలు నమ్మవద్దని మంత్రి కోరారు. నల్లగొండ పట్టణ సమగ్ర అభివృద్ధి కోసం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 48 డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకువచ్చే కాంగ్రెస్ కార్పొరేటర్లకు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని ఎప్పటికీ నిలబెట్టుకుంటానని, శాంతిభద్రతలను కాపాడుతూ నల్లగొండను అభివృద్ధిలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలుపుతానని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.



# మున్సిపల్ ఎన్నికల భద్రతపై డీజీపీ ఆదేశాలు

- పోలీసు యంత్రాంగానికి అప్రమత్తత సూచన
- అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా చర్యలు
- సీపీలు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్



**హైదరాబాద్, ఫిబ్రవరి 3**
మున్సిపల్ ఎన్నికలను సమర్థవంతంగా, శాంతియుతంగా నిర్వహించాలని రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి ఐపీఎస్ పోలీసు అధికారులకు సూచించారు. ఎన్నికలు జరగనున్న ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ఎన్నికలు నిర్వహించనున్న జిల్లాల పోలీసు కమిషనర్లు, ఎస్పీలు, స్టేషన్ హౌజ్ ఆఫీసర్లతో డీజీపీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల సమయంలో చట్టసువ్యవస్థ పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు ఆదేశించారు. సున్నిత ప్రాంతాలను గుర్తించి అదనపు బందోబస్తు ఏర్పాటు చేయాలని, సమస్యాత్మక వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని డీజీపీ సూచించారు. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలు ప్రశాంతంగా జరిగేలా అన్ని స్థాయిల్లో సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో పోలీసులు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు భద్రతా భావన కలిగేలా విధులు నిర్వర్తించాలని డీజీపీ బి. శివధర్ రెడ్డి ఐపీఎస్ అధికారులకు స్పష్టం చేశారు.

# మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్

- రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ సమీక్ష
- కరీంనగర్ నుంచి జిల్లా అధికారుల హాజరు
- పోలింగ్ ఏర్పాట్లపై కలెక్టర్ భరోసా



**కరీంనగర్, ఫిబ్రవరి 3:**
మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ. రాణి కుముదిని వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో కరీంనగర్ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, శాంతియుతంగా సాగేందుకు తీసుకో వాల్సిన చర్యలపై కమిషనర్ అధికారులకు సూచనలు చేశారు. పోలింగ్ నిర్వహణ, ఓటర్ల సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, పోలింగ్‌కు అవసరమైన అన్ని ఏర్పాట్లతో జిల్లా యంత్రాంగం పూర్తిగా సంసిద్ధంగా ఉందని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని, సిబ్బంది శిక్షణ, సామగ్రి పంపిణీ ప్రక్రియను సమర్థంగా అమలు చేస్తున్నామని చెప్పారు. ఎన్నికల రోజున ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా అన్ని శాఖల సమన్వయంతో ముందస్తు ప్రణాళిక రూపొందించినట్లు కలెక్టర్ వివరించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేస్తూ, మున్సిపల్ ఎన్నికలను విజయవంతంగా నిర్వహిస్తామని జిల్లా అధికారులు భరోసా ఇచ్చారు.

## అజిత్ పవార్ అంత్యక్రియల్లో రెచ్చిపోయిన దొంగలు.. ఏడుగురి అరెస్ట్

**పూణె, ఫిబ్రవరి 03:** జనవరి 28న విమాన ప్రమాదంలో మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ సహా ఐదుగురు మరణించిన విషయం తెలిసిందే. అయితే, జనవరి 29(గురువారం)న బారామతిలో విద్యా ప్రతిష్ఠాన్ మైదానంలో ఆయన అంత్యక్రియలు జరగ్గా కొందరు రెచ్చిపోయారు. ఈ కార్యక్రమంలో (ూాయిఠ్ ్ఘుఝుతీ ఖీబఅవతీఝుశ్రీ) కొంతమంది దొంగలు తమ చేతివాటం చూపించారు. అంత్యక్రియలకు హాజరైన వారిలో దాదాపు 15మంది వ్యక్తులకు చెందిన రూ.30లక్షల విలువ చేసే బంగారు వస్తువులను కొట్టేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. తాజాగా ఈ కేసులో ఏడుగురిని అరెస్ట్ చేశారు. నిందితులను రాజ్‌కుమార్ బాబురావు అథవాలే, మహ్మద్ అనీస్, ఎజాజ్ భగు మిరావాలే, మహ్మద్ సాదిక్, బాలు అలియాస్ దత్తాత్రయ బాబాన్ ధోత్రే, తుషార్ కైలాస్ మసాల్, నితిన్ అంకుష్ గైక్వాడ్‌లుగా గుర్తించారు. పలువురి బంగారు గొలుసులు, నగదు చోరీకి గురైనట్లు విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు. సాంకేతిక, రహస్య సమాచారం ఆధారంగా దర్యాప్తు ప్రారంభించి, నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.



## ధనుష్‌తో మరోసారి జతకడుతున్న సాయిపల్లవి..

### డీ55లో హీరోయిన్‌గా నేచురల్ బ్యూటీ

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్, నేచురల్ బ్యూటీ సాయిపల్లవి కాంబినేషన్ అంటే ప్రేక్షకులకు మొదట గుర్తొచ్చేది 'రౌడీ బేబీ' పాట. 'మారి 2' చిత్రంలోని ఈ పాటకు ప్రేక్షకుల ఫిదా అవ్వడంతో పాటు వీరిద్దరి కెమిస్ట్రీకి మంచి మార్కులు పడ్డాయి. అయితే ఇప్పుడు దాదాపు ఆరేళ్ల తర్వాత ఈ క్రేజీ జోడీ మరోసారి వెండితెరపై సందడి చేయబోతున్నట్లు తెలుస్తోంది. ధనుష్ కెరీర్‌లో 55వ చిత్రంగా రాబోతున్న డి55 లో సాయిపల్లవి హీరోయిన్‌గా ఎంపికైనట్లు తెలుస్తుంది. ఇప్పటికే ఈ చిత్రంలో శ్రీలీలను కథానాయికగా తీసుకున్న చిత్రబృందం మరో హీరోయిన్ పాత్ర కోసం సాయి పల్లవిని సంప్రదించగా.. సాయి పల్లవి ఒకే చెప్పినట్లు తెలుస్తుంది. ఈ సినిమాకు అమరన్ సినిమాతో సూపర్ హిట్ అందుకున్న రాజ్ కుమార్ పెరియాస్వామి దర్శకత్వం వహించబోతున్నాడు. 'వండర్‌బార్ ఫిల్మ్స్' సంస్థ ఈ సినిమాను నిర్మించబోతుంది.

## టాలీవుడ్‌లో సీక్వెల్స్ ట్రెండ్ జోరు..

### పార్ట్ 2, పార్ట్ 3లతో రాబోతున్న భారీ సినిమాలు!



ఒకప్పుడు సినిమా అంటే ఒక పార్ట్‌తో ముగిసిపోయే కథ. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. తెలుగు ప్రేక్షకులు ఎక్కువగా వినని "సీక్వెల్" అనే పదం ఇప్పుడు ఇండస్ట్రీలో అత్యంత వినిపిస్తున్న మాటగా మారింది. ఒక హిట్ సినిమా వస్తే... దానికి రెండో భాగం, మూడో భాగం తీసే ట్రెండ్ వేగంగా పెరుగుతోంది. దర్శకులు, హీరోలు, నిర్మాతలు అందరూ ఇప్పుడు సీక్వెల్స్‌పైనే దృష్టి పెడుతున్నారు. ప్రేక్షకుల్లోనూ అదే ఆసక్తి కనిపిస్తుండటంతో ఇది ఇండస్ట్రీలో ఓ కొత్త ట్రెండ్‌గా మారింది. ఫ్యామిలీ ఎమోషన్‌తో కూడిన క్రైమ్ థ్రిల్లర్‌గా 'దృశ్యం' సిరీస్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. వెంకటేష్ నటించిన 'దృశ్యం', 'దృశ్యం 2' రెండూ సూపర్ హిట్ అయ్యాయి. ఇప్పుడు 'దృశ్యం 3' కోసం సిద్ధమవుతున్నారు. మలయాళ వెర్షన్ ఇప్పటికే పూర్తయి విడుదలకు రెడీగా ఉండగా, హిందీ వెర్షన్ షూటింగ్ దశలో ఉంది. రెండో భాగం ముగిసిన దగ్గర నుంచే మూడో భాగం ప్రారంభమవుతుందని సమాచారం. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ఈ ఏడాది రెండు భారీ సీక్వెల్స్‌తో రానున్నాడనే టాక్ గట్టిగా వినిపిస్తోంది. అవే 'కల్కి 2', 'సలార్ 2'. ప్రస్తుతం 'ఫౌజీ', 'స్పిరిట్' షూటింగ్స్‌లో బిజీగా ఉన్న ప్రభాస్... వాటి తర్వాత 'కల్కి 2'ను మొదలు పెట్టి, ఆపై 'సలార్ 2'పై దృష్టి పెట్టనున్నాడని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ప్రశాంత్ నీల్ ఇతర ప్రాజెక్టులు పూర్తి చేసిన తర్వాతే 'సలార్ 2' పట్టాలెక్కే అవకాశం ఉంది. ఎన్టీఆర్ -- కొరటాల శివ కాంబినేషన్‌లో వచ్చిన 'దేవర'కు సీక్వెల్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. 'దేవర 2' స్క్రిప్ట్ పనులు ఇప్పటికే కొనసాగుతున్నాయని, త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లే అవకాశముందని సమాచారం. యంగ్ హీరో తేజ సజ్జ కూడా సీక్వెల్స్ రేసులో ముందంజలో ఉన్నాడు. 'జాంబిరెడ్డి 2', 'జై హనుమాన్', 'మిరాయ్ 2' చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. 'జై హనుమాన్'లో కన్నడ స్టార్ రిషబ్ శెట్టి కీలక పాత్ర పోషించనున్నాడనే వార్త సినిమాపై మరింత హైప్ తీసుకొచ్చింది. చిన్న సినిమాల సీక్వెల్స్ కూడా రేసులో ఉన్నాయి. 'ఈ నగరానికి ఏమైంది' సీక్వెల్ 'జుచీజు రిపీట్' పేరుతో రాబోతోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నుంచి వచ్చిన 'మ్యాడ్' సిరీస్ ఇప్పటికే రెండు భాగాలతో విజయం సాధించగా, ఇప్పుడు 'మ్యాడ్ జూనియర్స్' రూపొందుతోంది. హారర్ థ్రిల్లర్ 'పొలిమేర 3'ను పాన్ ఇండియా స్థాయిలో తీసుకురావడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఇవి మాత్రమే కాకుండా 'పుష్ప 3', 'కార్తికేయ 3', 'టిల్లు క్యూబ్', 'కేజీఎఫ్ 3' వంటి ప్రాజెక్టులు కూడా భవిష్యత్తులో రాబోతున్నాయి.

## బెదిరిస్తారు... ఆ తర్వాత మామిడికాయలు ఇస్తారు..

### 'హనీ' ట్రైలర్ లాంచ్‌లో దివి వాద్య కామెంట్స్ వైరల్...

బుల్లితెరపై ప్రసారమైన పాపులర్ రియాలిటీ షో బిగ్ బాస్ సీజన్ 4 ద్వారా మంచి గుర్తింపు సంపాదించుకున్న తెలుగు నటి దివి వాద్య. బిగ్ బాస్ షో అనంతరం వరుస సినిమాల్లో అవకాశాలు అందుకుంటూ కెరీర్‌ను ముందుకు తీసుకెళ్తోంది. తాజాగా ఆమె కీలక పాత్రలో నటించిన తెలుగు హారర్ సైకలాజికల్ థ్రిల్లర్ చిత్రం 'హనీ' ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. పలాస ఫేమ్ దర్శకుడు కరుణ కుమార్ రచన, దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో టాలీవుడ్ హీరో నవీన్ చంద్ర, నటి దివ్య పిళ్లై ప్రధాన పాత్రల్లో నటించగా, సీనియర్ నటుడు రాజా రవీంద్ర కూడా ముఖ్య పాత్ర పోషించారు. ఇటీవల విడుదలైన ట్రైలర్‌కు మంచి స్పందన లభించడంతో చిత్రబృందం ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో దివి వాద్య చేసిన సరదా వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈవెంట్‌లో మాట్లాడిన దివి మొదట దర్శకుడు కరుణ కుమార్‌తో పని చేయాలనే తన కోరికను వ్యక్తపరుస్తూ, పలాస సినిమా సమయంలో కలిసినా అప్పట్లో అవకాశం రాలేదని, ఈ కథ వినగానే చాలా ఎగ్జైటెడ్‌గా ఫీలయ్యానని తెలిపింది. నవీన్ చంద్ర, దివ్య పిళ్లై, రాజా రవీంద్ర వంటి అనుభవజ్ఞులైన నటులతో కలిసి పని చేయడం ఆనందంగా ఉందని, ఈ సినిమా ప్రేక్షకులను వెంటాడే విధంగా ఉంటుందని, అందరూ ఫిబ్రవరి 6న థియేటర్లకు వెళ్లి చూడాలని కోరింది. అనంతరం మీడియా ప్రతినిధులు ఆమె పాత్ర గురించి ప్రశ్నించగా, ట్రైలర్‌లో కనిపిస్తున్నట్లు తన క్యారెక్టర్‌లో డార్క్ షేడ్స్ ఉంటాయని సింపుల్‌గా సమాధానం ఇచ్చింది. అయితే ఆమె అలా చెప్పగానే పక్కనే ఉన్న రాజా రవీంద్ర "ఏయ్" అంటూ సరదాగా వారించడం అక్కడ నవ్వులు పూయించింది. దానికి స్పందించిన దివి "చెప్పొద్దా?" అంటూ సరదాగా ప్రశ్నించగా, రాజా రవీంద్ర నిశ్శబ్దంగా ఉండిపోయాడు. వెంటనే దివి "ఇలా అందరి ముందు బెదిరిస్తారు... ఎవరు లేనప్పుడు మాత్రం మామిడి కాయలు ఇస్తారు" అని చమత్కరించడంతో హాల్ మొత్తం నవ్వులతో మార్మోగింది. దాంతో రాజా రవీంద్ర షూటింగ్ సమ్మర్‌లో జరిగిన విషయమని వివరణ ఇచ్చాడు. రిపోర్టర్లు మామిడి కాయల విషయంపై అడగగా, సెట్స్‌లో రాజా రవీంద్ర గారి హాస్పిటాలిటీ చాలా బాగుండేదని, అదే ఉద్దేశంతో అలా అన్నానని దివి క్లారిటీ ఇచ్చింది. అనంతరం తన పాత్రపై మాట్లాడుతూ, సినిమాలో తన డార్క్ సైడ్ ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తుందని, ఇలాంటి నెగెటివ్ లేదా డిఫరెంట్ షేడ్స్ ఉన్న పాత్రలు భవిష్యత్తులో మరింత వస్తాయని ఆశిస్తున్నానని చెప్పింది. దర్శకుడు కరుణ కుమార్ తన నుంచి అద్భుతమైన పెర్ఫార్మెన్స్ తీసుకున్నారని, తానేనా ఇలా చేశానని అనిపించేలా పని చేయించారని పేర్కొంది. మొత్తానికి 'హనీ' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో దివి వాద్య చేసిన సరదా వ్యాఖ్యలు, రాజా రవీంద్రతో జరిగిన ఫన్నీ మోమెంట్స్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి.

